వెంకన్న బ్రహ్మోత్సవాలకు సర్వం సిద్ధం

- నేడు ధ్వజారోహణం
- శాస్త్రోక్తకంగా అంకురార్పణ

చంద్రగిరి: శ్రీనివాస మంగాపురంలోని కల్యాణ వెంకటేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలకు టీటీడీ అధికారులు సర్వం సిద్ధం చేశారు. ఇందులో భాగంగా చలువ పందిళ్లు, రంగవల్లులతో అందంగా తీర్చిదిద్దారు. ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన దేవేరుల భారీ విద్యుత్ కటౌట్లు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం రాత్రి అంకురార్పణను శాస్త్రోక్తకంగా నిర్వహించారు. ఉదయం స్వామి వారిని సుప్రభాతంతో మేల్కొలిపి తోమాల, కొలువు, పంచాంగ శ్రవణం, అర్చన కార్యక్రమాలతో నిత్య కైంకర్యాలు చేశారు. అనంతరం స్వామి వారికి వైఖానస ఆగమోక్తంగా ఆర్జిత నిత్య కల్యాణోత్సవం చేశారు. సాయంత్రం ఆరు గంటల నుంచి మత్స్యంగ్రహణం, సేనాధిపతి ఉత్సవాలు నిర్వహించారు. అనంతరం పుణ్యాహవచనం, మృత్సంగ్రహణం చేపట్టారు. ఉత్సవర్లను ఆలయంలోకి వేంచేపు చేసి పుట్టమన్ను తీసి యజ్ఞయాగాది కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలోని యాగశాలలో శాస్త్రోక్తంగా అంకురార్పణను చేపట్టారు.



ఆలయ ఆవరణలోని కోనేరు వద్ద ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్న విద్యుత్ కటౌట్లు

నేడు ధ్వజారోహణం

శనివారం ఉదయం 6.30 నుంచి 8.15 గంటల వరకు తిరుచ్చి ఉత్సవం, ఉదయం 8.40 నుంచి 9 గంటల మధ్య మీనలగ్నంలో ధ్వజారోహణం నిర్వహించి బ్రహ్మోత్సవాలను ప్రారంభించనున్నారు. తిరిగి రాత్రి 7 గంటల నుంచి 8 వరకు స్వామివారు పెద్దశేష వాహనంపై తిరుమాడవీధుల్లో ఊరేగుతారు. ప్రతి రోజూ ఉదయం 8 నుంచి 9 గంటల వరకు, తిరిగి రాత్రి 8 నుంచి 9 గంటల వరకు వాహన సేవలు జరుగుతాయి. బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆలయంలోని అన్ని రకాల ఆర్జిత సేవలను టీటీడీ రద్దు చేసింది. కార్యక్రమంలో ఆలయ స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ ఈఓ వరలక్ష్మీ, ఏఈఓ గురుమూర్తి, సూపరింటెండెంట్ చెంగల్రాయులు, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ కిరణ్‌కుమార్ రెడ్డి పాల్గొన్నారు.





విశేష అలంకరణలో సేనాధిపతి, పుట్టమన్నును సేకరిస్తున్న అర్చకులు, విదేశీ పుష్పాలతో అలంకరించిన ఆలయంలోని బలిపీఠం

క్లుప్తంగా

బ్రహ్మోత్సవాలకు కలెక్టర్‌కు ఆహ్వానం



బ్రహ్మోత్సవాలకు జిల్లా కలెక్టర్‌ను ఆహ్వానిస్తున్న తలకోన ఆలయ ఈవో జయకుమార్

ఎర్రావారిపాళెం: తలకోన సిద్ధేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలకు విచ్చేయాలని అధికారులు శుక్రవారం తిరుపతి జిల్లా కలెక్టర్ వెంకటరమణారెడ్డిని ఆహ్వానించారు. వారు కలెక్టరేట్‌లో కలెక్టర్‌ను కలిసి బ్రహ్మోత్సవ ఆహ్వాన పత్రిక, స్వామి, అమ్మవారి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈవో జయకుమార్, అర్చకులు ప్రసన్నశర్మ తదితరులు పాల్గొన్నారు.

ప్లేస్‌మెంట్ డ్రైవ్‌లో 54 మందికి ఉద్యోగాలు

తిరుపతి ఎడ్యుకేషన్: తిరుపతి కపిలతీర్థం రోడ్డులోని ఎస్వీ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో శుక్రవారం శ్రీసిటీలోని డైకిన్ సంస్థ ప్రతినిధులు డిప్లొమో ఇంజినీర్ ట్రైనీ ఉద్యోగాలకు ప్లేస్‌మెంట్ డ్రైవ్ నిర్వహించారు. ఇందులో ఎలక్ట్రికల్, మెకానికల్, ఎలక్ట్రానిక్స్, ఆటోమొబైల్ విభాగాలకు చెందిన డిప్లొమో అభ్యర్థులు హాజరయ్యారు. వీరికి వివిధ ఎంపిక ప్రక్రియలు నిర్వహించి 54 మందిని ఉద్యోగాలకు ఎంపిక చేశారు. వారిని కళాశాల ప్రిన్సిపాల్ వై.ద్వారకనాథరెడ్డి, ప్లేస్‌మెంట్ అధికారులు ఎం.హరిప్రసాద్, సీహెచ్.శైలజ, అధ్యాపకులు అభినందించారు.

ఎమ్మెల్యే పెళ్లి కానుక పంపిణీ



వధువు కుటుంబ సభ్యులకు పెళ్లి కానుక అందజేస్తున్న దేవారెడ్డి

చంద్రగిరి: మండలంలోని కల్‌రోడ్డుపల్లికి చెందిన శివ, ప్రసన్న కుమారి, చంద్రగిరి కొత్తపేట చర్చివీధికి చెందిన పవన్ కుమార్, కావ్యకు వివాహం నిశ్చమైంది. వారికి చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి పంపిన పెళ్లి కానుకను శుక్రవారం వైఎస్సార్‌సీపీ డివిజన్ అధ్యక్షులు అగరాల దేవారెడ్డి, కుప్పిరెడ్డి భాస్కర్ రెడ్డిలు వేర్వేరుగా అందజేశారు.

పలువురికి జరిమానా

తిరుపతి లీగల్: తిరుపతి అర్బన్ పోలీసు స్టేషన్ పరిధిలో మద్యంతాగి వాహనాలు నడపడం, ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించడం వంటి నేరాలకు పాల్పడిన మూడు నాలుగు కేసుల్లో పలువురికి రూ.69,600 జరిమానా విధిస్తూ తిరుపతి 2వ ప్రత్యేక కోర్టు మెజిస్ట్రేట్ శ్రీనివాసులు శుక్రవారం తీర్పు చెప్పారు. అలాగే తిరుపతి రూరల్ పోలీసు స్టేషన్ పరిధిలో వివిధ నేరాలకు పాల్పడిన పలువురికి 35 కేసుల్లో రూ.7,650 జరిమానా విధిస్తూ మెజిస్ట్రేట్ తీర్పు చెప్పారు.

మామిడిలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి



మామిడి పూతను పరిశీలిస్తున్న హార్టికల్చర్ ఆఫీసర్ సునీల్

రామచంద్రాపురం: రైతులు మామిడిలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలని ఉద్యానవన శాఖాధికారి సునీల్ తెలిపారు. ఆయన శుక్రవారం నెత్తకుప్పంలోని మామిడి పంటలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఈ సంవత్సరం మామిడి పూత బాగా వచ్చిందన్నారు. మందులు పిచికారీ చేయకూడదని చెప్పారు. పూవు మొగ్గ దశలో ఉన్నప్పుడు చీడపీడలు ఆశిస్తే ఇమిడా క్లోరోఫ్రిడ్ 0.4 మిల్లీ లీటర్లను లీటర్ నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలని సూచించారు. పూత, పిందె రాలుతుంటే ప్లానోఫిక్స్ పిచికారీ చేయాలన్నారు.

ఉయ్యాల సేవలో పద్మావతీ అమ్మవారు



నారాయణవనం: పద్మావతీ సమేత వెంకన్న ఆలయంలో శుక్రవారం సాయంత్రం పద్మావతీ అమ్మవారికి గంట పాటు ఉయ్యాల సేవ నిర్వహించారు. ఉదయం సుప్రభాత సేవలో మేల్కొన్న స్వామికి నిత్య పూజా కైంకర్యాలలో భాగంగా తోమాల, శుద్ధి తదితర కార్యక్రమాలు నిర్వహించారు. 7 గంటలకు వెంకన్నకు, పద్మావతీ అమ్మవార్లకు శుక్రవార అభిషేకాలను నిర్వహించారు. సాయంత్రం పూజల అనంతరం తిరుచ్చి వాహనాన్ని అధిరోహించిన పద్మావతీ అమ్మవారు ఆలయ ప్రాకారంలో ఊరేగారు. ఉయ్యాలసేవను వీక్షించిన భక్తులు తీర్థ ప్రసాదాలు అందుకున్నారు.

సంక్షేమానికి భరోసా కల్పిస్తూ..



పేరూరు పంచాయతీలో సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎంపీపీ చెవిరెడ్డి మోహిత్ రెడ్డి

- 10 గంటల పాదయాత్రలో 2253 ఇళ్ల సందర్శన
- పంచాయతీలో రూ.7.57 కోట్ల అభివృద్ధి పనులు
- పేరూరులో ముగిసిన ఎంపీపీ చెవిరెడ్డి మోహిత్ రెడ్డి పర్యటన

తిరుపతి రూరల్: చేసిన అభివృద్ధిని వివరిస్తూ.. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలను తెలియజేస్తూ.. స్థానికుల సమస్యల పరిష్కారానికి భరోసా కల్పిస్తూ తిరుపతి రూరల్ ఎంపీపీ చెవిరెడ్డి మోహిత్ రెడ్డి ముందుకు సాగారు. ఆయన శుక్రవారం పేరూరు పంచాయతీలో రెండో రోజు శుక్రవారం కూడా గడప గడపకూ మహా పాదయాత్ర చేపట్టారు. హరిపురం కాలనీ, జనార్దన్ కాలనీ, నలంద నగర్‌లో 2,253 ఇళ్లను సందర్శించారు. ఉదయం 9 నుంచి రాత్రి 7 గంటల వరకు 10 గంటలకు పైగా ఈ మహా పాదయాత్ర కొనసాగింది. ఆయనకు సర్పంచ్ దామినేటి కేశవులు, ఉప సర్పంచ్ పొట్టిరెడ్డిగారి పరంధామరెడ్డి, ఎంపీటీసీ మూలం చంద్రమోహన్ రెడ్డి, పార్టీ డివిజన్ అధ్యక్షుడు చెంచు మోహన్ యాదవ్ ఆధ్వర్యంలో మహిళలు పూల వర్షం కురిపించి హారతులతో స్వాగతం పలికారు. ముందుగా మోహిత్‌రెడ్డి దివంగత మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం గడప గడపకూ వెళ్లి ప్రభుత్వ పథకాలు అందుతున్నాయా అంటూ ఆరా తీశారు. ఆయా కుటుంబాలకు సీఎం జగన్ ప్రభుత్వంలో మూడున్నరేళ్లలో సంక్షేమ పథకాల ద్వారా చేకూరిన ప్రయోజనాలను బుక్లెట్లతో వివరించారు. ఇన్ని సంక్షేమ పథకాలు అందజేస్తున్న సీఎం జగన్ మోహన్ రెడ్డిని, నిరంతరం అందుబాటులో ఉంటున్న ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డిని ఆశీర్వదించాలని కోరారు.

రూ.7.57 కోట్లతో అభివృద్ధి పనులు

పేరూరు- 2, 3 పంచాయతీల పరిధిలో రూ.7.57 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టినట్లు ఎంపీపీ వెల్లడించారు. ఒక్క హౌసింగ్ పథకం కింద రూ.4 కోట్లు కేటాయించినట్లు తెలిపారు. ప్రతి ప్రాంతమూ అభివృద్ధి చేయడమే తమ అభిమతమని వివరించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ విడుదల మాధవరెడ్డి, జెడ్పీటీసీ రత్నమ్మ, జానకి రామిరెడ్డి, హరీష్, శీనా యాదవ్, మహేష్, జాన్, బాషా, దినేష్ పాల్గొన్నారు.

శ్రీవారిని దర్శించుకున్న ప్రముఖులు



డిప్యూటీ స్పీకర్ వీరభద్ర స్వామి

తిరుమల: శ్రీవారిని శుక్రవారం డిప్యూటీ స్పీకర్ వీరభద్ర స్వామి, సినీ నిర్మాత బండ్ల గణేష్, ఎంపీ బ్రహ్మానంద రెడ్డి, మాజీ మంత్రి సిద్ద రాఘవులు దర్శించుకున్నారు. వారికి అధికారులు ప్రత్యేక దర్శనం ఏర్పాట్లు చేశారు. శ్రీవారి దర్శనం అనంతరం రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనం అందించగా అధికారులు లడ్డూ ప్రసాదాలతో సత్కరించారు.

మార్షల్ ఆర్ట్స్‌తో ఆడపిల్లల్లో ఆత్మవిశ్వాసం

తిరుచానూరు: నేటి సమాజంలో మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలను అధిగమించాలంటే ప్రతి ఒక్కరిలోనూ ఆత్మవిశ్వాసం పెంపొందించడానికి మార్షల్ ఆర్ట్స్ ఎంతగానో దోహదపడుతుందని ఎన్ఎస్ఎస్ యూనిట్ సెవెన్ ప్రోగ్రాం ఆఫీసర్ పి.మాధవి తెలిపారు. శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలోని మహిళా అధ్యయన కేంద్రం, ఎన్ఎస్ఎస్ యూనిట్ సెవెన్ సంయుక్తంగా శుక్రవారం ఫిజిక్స్ డిపార్టుమెంట్‌కు చెందిన విద్యార్థులకు స్వీయ రక్షణపై కరాటే నిపుణులు శిక్షణ ఇచ్చారు. మార్షల్ ఆర్ట్స్‌లో ప్రావీణ్యం పొందడం ద్వారా ఆత్మవిశ్వాసం, ఆత్మస్థైర్యం పెరగడమే కాక మానసికంగా, శారీరకంగా దృఢత్వం కలిగి ఉంటారని తెలిపారు. మహిళా అధ్యయన కేంద్రం అధ్యాపకులు కే.రాణి, ఎం.సుచరిత, రత్నాకర్ పాల్గొన్నారు.

లోక్ అదాలత్ బెంచ్ అధ్యక్షుడిగా జడ్జి పవన్‌కుమార్

తిరుపతి లీగల్: సత్యవేడు కోర్టులో శనివారం జరగనున్న జాతీయ లోక్ అదాలత్ బెంచ్ అధ్యక్షుడిగా తిరుపతి మొదటి అదనపు జూనియర్ సివిల్ జడ్జి పవన్‌కుమార్‌ను నియమిస్తూ జిల్లా జడ్జి భీమారావు శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. సత్యవేడు కోర్టులో జరగనున్న లోక్ అదాలత్‌లో కేసుల పరిష్కారం, తదితర బాధ్యతలను జడ్జి పవన్‌కుమార్ పర్యవేక్షించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

తిరుపతి బస్టాండ్‌లో ఆగిన తెలంగాణ గరుడ ప్లస్

తిరుపతి అర్బన్: తెలంగాణ రాష్ట్రానికి చెందిన గరుడ ప్లస్ ఏసీ సర్వీస్ బస్సు తిరుపతి సెంట్రల్ బస్టాండ్‌లోని శ్రీహరి బస్టాండ్‌లో 17వ ప్లాట్‌ఫాంలో మూడు రోజులుగా నిలిచిపోయింది. ఈ ప్లాట్‌ఫాం నుంచి ప్రతి రోజూ 75 బస్సులు నడుస్తాయి. తెలంగాణ బస్సు మూడు రోజులుగా ఆగిపోవడంతో 225 బస్సులకు ప్లాట్‌ఫాం లేకపోవడంతో ఇబ్బంది పడాల్సి వచ్చింది. మరమ్మతులకు గురైన తెలంగాణ గరుడ ప్లస్ ఏసీ సర్వీసును బాగుచేయించి పంపడంలో ఆర్టీసీ అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి తెలంగాణ బస్సును అక్కడి నుంచి తొలగించాలని స్థానిక డ్రైవర్లు కోరుతున్నారు. దీనిపై అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్ రామచంద్రనాయుడు వివరణ ఇస్తూ మరమ్మతులకు గురైన తెలంగాణ గరుడ ప్లస్ ఏసీ సర్వీస్ బస్సును బాగు చేయిస్తున్నామన్నారు. శుక్రవారం రాత్రికి క్లియర్ చేస్తామని వెల్లడించారు.



ప్లాట్‌ఫాంలో ఆగిన గరుడ ప్లస్ ఏసీ సర్వీస్

కపిలేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ




ఊరేగుతున్న వినాయకస్వామి, ఆలయంలో బ్రహ్మోత్సవాలకు శాస్త్రోక్తంగా అంకురార్పణ చేపడుతున్న అర్చకులు

తిరుపతి కల్చరల్: కపిలేశ్వరస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలకు శుక్రవారం సాయంత్రం శాస్త్రోక్తంగా అంకురార్పణ చేశారు. ఈ సందర్భంగా వినాయకస్వామి మూషిక వాహనంపై విహరిస్తూ భక్తులకు దర్శనమిచ్చారు. కార్యక్రమంలో జేఈవో వీరబ్రహ్మం దంపతులు, ఆలయ డిప్యూటీ ఈవో దేవేంద్రబాబు, ఈవో పార్థసారథి, సూపరింటెండెంట్ భూపతి పాల్గొన్నారు.

నేడు ధ్వజారోహణ కార్యక్రమం

శనివారం ఉదయం 8.54 గంటలకు మీన లగ్నంలో ధ్వజారోహణంతో కపిలేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభమవుతాయి. ఉదయం 9.30 నుంచి 11.30 గంటల వరకు పల్లకి ఉత్సవం, రాత్రి 8 నుంచి 10 గంటల వరకు హంస వాహన సేవ నిర్వహిస్తారు.

అభివృద్ధి, సంక్షేమమే ముఖ్యమంత్రి ధ్యేయం



సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తున్న డిప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డి

- డిప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డి
- 3వ డివిజన్‌లో గడప గడపకూ మన ప్రభుత్వం

తిరుపతి మంగళం: ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అభివృద్ధి, ప్రజా సంక్షేమం రెండు కళ్లుగా భావించి పరిపాలన సాగిస్తున్నారని డిప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డి తెలిపారు. ఆయన శుక్రవారం కార్పొరేటర్ తమ్ముడు గణేష్, వైఎస్సార్ సీపీ డివిజన్ అధ్యక్షుడు వెంకటేష్ తో కలిసి తిరుపతి 3వ డివిజన్‌లోని లక్ష్మీపురంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతి ఇంటికీ వెళ్లి మూడున్నరేళ్లలో జగనన్న అందించిన సంక్షేమ పథకాలను వివరించారు. వారి సమస్యలను తెలుసుకుని పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఆయన మాట్లాడుతూ పేదల అభ్యున్నతి, సంక్షేమమే జగనన్న ఆశయం, లక్ష్యమన్నారు. దేశ రాజకీయాల్లోనే ఇంతవరకు ఏ నాయకుడూ అందించలేనన్ని సంక్షేమ పథకాలు అమలుచేశారని పేర్కొన్నారు. ఆ పథకాలు పేదల జీవితాల్లో వెలుగులు నింపాయని తెలిపారు. వచ్చే ఎన్నికల్లో ఓటుతో రుణం తీర్చుకుంటామని ప్రతి గడపలోనూ చెబుతున్నారని తెలిపారు. ఏ గడపకు వెళ్లినా ప్రజలు తమను ఎంతగానో ఆదరిస్తున్నారని వెల్లడించారు. కార్యక్రమంలో టౌన్‌బ్యాంకు చైర్మన్ కేతం జయచంద్రారెడ్డి, పార్టీ నాయకులు మల్లం రవిచంద్రారెడ్డి, సోమశేఖర్‌రెడ్డి, మునిరెడ్డి, కుమార్, పాండు, రాజేష్, సుబ్రమణ్యం, యమునమ్మ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన ఆలయ మహాకుంభాభిషేకం



అమ్మవారి ఆలయ గోపురానికి మొక్కుతున్న ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి



ఆలయ గోపుర కలశానికి పూజలు చేస్తున్న సర్పంచ్ రామచంద్రారెడ్డి



యాగశాల నుంచి కలశాలను ఊరేగింపుగా తీసుకొస్తున్న అర్చకులు, రుత్వికులు, స్థానికులు

తిరుచానూరు: యోగిమల్లవరంలో వెలసిన కామాక్ష్యాంబ సమేత పరాశరేశ్వరస్వామి ఆలయంలో ఈ నెల 1వ తేదీ నుంచి చేపట్టిన మహాకుంభాభిషేకం శుక్రవారం మహాపూర్ణాహుతితో ముగిసింది. వెయ్యేళ్ల చరిత్ర కలిగిన ఈ ఆలయాన్ని సర్పంచ్ కె.రామచంద్రారెడ్డి, ఇతర దాతల సహకారంతో జీర్ణోద్ధరణ చేశారు. సుమారు 20 ఏళ్ల తర్వాత ఆలయ ప్రధానార్చకులు మూర్తి గురుకుల్ సారథ్యంలో మహా కుంభాభిషేకాన్ని ఆగమోక్తంగా చేపట్టారు. ఇందులో భాగంగా యాగశాలలో మహా పూర్ణాహుతి నిర్వహించి అక్కడి నుంచి కలశాలను ఊరేగింపుగా ఆలయానికి తీసుకొచ్చి స్వామి, అమ్మవార్ల విమాన గోపురం, రాజగోపురం, ఇతర పరివార దేవతల గోపురాలపై ఉన్న కలశాలకు అభిషేకం చేశారు. మధ్యాహ్నం 12 గంటలకు స్వామికి ప్రత్యేక అభిషేకం చేశారు. భక్తులకు అన్నదానం చేశారు. సాయంత్రం 6 గంటలకు ఆలయ ప్రాంగణంలో ఆదిదంపతుల కల్యాణాన్ని నేత్రపర్వంగా నిర్వహించారు. గణపతి, వళ్లీదేవసేన సమేత సుబ్రమణ్యస్వామి, చండీకేశ్వరస్వామి సహా స్వామి, అమ్మవార్లు గ్రామంలో విహరిస్తూ భక్తులను అనుగ్రహించారు. మహాకుంభాభిషేక వేడుకల్లో చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, సర్పంచ్ కె.రామచంద్రారెడ్డి, ఆలయ ఈఓ రామచంద్రారెడ్డి, గ్రామ పెద్దలు, భక్తులు పాల్గొన్నారు.

ఎన్నికల నియమావళి పాటించాలి



నాయకులతో సమావేశమైన కమిషనర్ అనుపమ అంజలి



మాట్లాడుతున్న తహసీల్దార్ శిరీష

తిరుపతి తుడా: ఎమ్మెల్సీ ఎన్నికల నియమావళిని అన్ని రాజకీయ పార్టీల నాయకులు పాటించాలని తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ అనుపమ అంజలి కోరారు. ఆమె శుక్రవారం తిరుపతి నియోజకవర్గంలో ఎన్నికల నిర్వహణపై రాజకీయ పార్టీల నాయకులతో సమావేశమయ్యారు. ఆమె మాట్లాడుతూ ఈ నెల 16న నోటిఫికేషన్ జారీ అవుతుందన్నారు. 23 వరకు నామినేషన్ల స్వీకరణ, 27 వరకు ఉప సంహరణ ఉంటుందన్నారు. మార్చి 13న పోలింగ్, 16న ఓట్ల లెక్కింపు ఉంటాయని వివరించారు. ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిందని, అందరూ సహకరించాలని కోరారు. ఉప కమిషనర్ చంద్రమౌళీశ్వర్‌రెడ్డి, తిరుపతి అర్బన్ తహసీల్దార్ వెంకటరమణ పాల్గొన్నారు.

ఎన్నికల కోడ్‌కు సహకరించండి

చంద్రగిరి: ఎమ్మెల్సీ ఎన్నికల సమీపిస్తున్న క్రమంలో కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ప్రతి ఒక్కరూ ఎన్నికల కోడ్‌కు సహకరించాలని తహసీల్దార్ శిరీష కోరారు. ఆమె శుక్రవారం అన్ని రాజకీయ పార్టీల నాయకులతో సమావేశమయ్యారు. ఆమె మాట్లాడుతూ గురువారం నుంచి మార్చి వరకు ఎన్నికల కోడ్ అమలులో ఉంటుందన్నారు. ఈ నెల 16న నోటిఫికేషన్, 23న నామినేషన్, 27న విత్‌డ్రాలు ఉంటాయన్నారు. మార్చి 13న పోలింగ్, 16 ఫలితాలు వెల్లడి ఉంటాయని తెలిపారు. ఎవరైనా కోడ్ ఉల్లంఘనకు పాల్పడితే చర్యలు తీసుకుంటామని తేల్చి చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ హేమేంద్రకుమార్‌రెడ్డి, నాయకులు దేవారెడ్డి, దీనదయాల్ నాయుడు, ఎస్ఐ వంశీధర్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

తిరుపతి రూరల్: తిరుపతి నగరంలో పలు విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలో విద్యుత్ లైన్ల మరమ్మతులు, చెట్ల కొమ్మల తొలగింపు కారణంగా శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపేస్తున్నట్టు ఎస్పీడీసీఎల్ తిరుపతి డివిజన్ ఈఈ వాసుదేవరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ముండ్లపూడి, వీవీ నగర్, పాడిపేట, బ్రాహ్మణపట్టు, కేబీలేఅవుట్, పాత ప్రసూతి ఆస్పత్రి, అనంతవీధి, చెన్నారెడ్డికాలనీ, సింగాలగుంట, అంబేడ్కర్‌కాలనీ, గాలివీధి, టీ.నగర్, ఎన్జీవోస్ కాలనీ, రామచంద్రనగర్, శాంతినగర్, వరదరాజనగర్, యశోదానగర్, సిరిపురంకాలనీ, సప్తగిరినగర్, ప్రకాశం రోడ్డు, గాంధీరోడ్డు, కర్నాల వీధి, పల్లి వీధి, జీయస్ మాడ, బలిజవీధి, చింతకాయల వీధి, గిడ్డంగి వీధి, మిట్టవీధి, పంట వీధి, బజారువీధి, బొమ్మగుంట, పరసాల వీధి, వైకుంఠపురం, ఎంఆర్‌పల్లి, న్యూబాలాజీకాలనీ, ఎయిర్ బైపాస్ రోడ్డు, మునిరెడ్డినగర్, కర్నాలవీధి, ప్రకాశంరోడ్డు, మారుతినగర్, ఎస్వీనగర్, పీవీ నగర్, శ్రీకృష్ణనగర్, గాయత్రినగర్, గాంధీపురం, వైకుంఠపురం, పద్మావతిపురం, బైరాగిపట్టెడ, రాయల్‌నగర్, ఈఎస్ఐ ఆస్పత్రి, కేసీపేట, నడవలూరు, భవానీనగర్, వినాయకనగర్, తాతయ్యగుంట, మాస్కోరోడ్డు, తిలక్ రోడ్డు, దేవేంద్ర థియేటర్, వీవీ మహల్ రోడ్డు, రైల్వేకాలనీ, సుందరయ్యనగర్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు.

వేదాంతపురం పంచాయతీలో

33/11కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌కు లైన్లు ఏర్పాటు చేయడంతోపాటు లైన్ల మరమ్మతుల కారణంగా అవిలాల సెక్షన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో శనివారం ఉదయం 8.30 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపేస్తున్నట్టు ఎస్పీడీసీఎల్ తిరుపతి డివిజన్ ఈఈ వాసుదేవరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీనివాసపురం, టెలిఫోన్‌కాలనీ, మార్కెట్ యార్డు, ఓటేరు, అవిలాల, ధనలక్ష్మీనగర్, ఆంధ్రా బ్యాంక్ కాలనీ, రాజీవ్‌గృహకల్ప, వేదాంతపురం ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు.

తిరుచానూరు: విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 8 నుంచి 12 గంటల వరకు వీవీనగర్, ముండ్లపూడి, పాడిపేట, బ్రాహ్మణపట్టు విద్యుత్‌కు అంతరాయం ఏర్పడుతుందని డివిజనల్ ఇంజనీర్ కె.వాసుదేవరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.